# గుబ్బం 'జాషువా' తో



ఎవరో జాషువా గారి శ్మశానం ఖండ కావ్యంలోని పద్యాలు బిగ్గరగా ఆలపిస్తూ వుంటారు

**మధురవాణి** : బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారి హరిశ్చంద్ర శ్మశానం లోని పద్యాలు మాని హరిదాసులు జాషువాగారి పద్యాలు చదువుతున్నారు, కాలం మారింది.

**గిరీశం:** థామస్ గ్రే రాసిన ఎలిజీలో శ్మశాన వాటిక మీదా గోరీల మీదా మంచి మంచి పద్యాలున్నాయి జాషువాగారికి అవే ఇన్స్పిరేషను అంటారు

**మధుర:** జాషువాగారికి యింగ్లీషేరాదే అంతగా

**గిరీశం:** గ్రేట్ పొయెట్స్ థింక్ ఎలైక్ అనగా గొప్ప కవ్స్ ఒక రీతిగానే ఆలోచిస్తారు ఆలోనచన్లు డాష్ యిస్తాయి ఏక్సిడెంటుగా కావ్యాలు, అనగా క్లాసిక్సు పుడతాయి

**మధుర:** జాషువాగారు క్లాసికల్ పొయెటా?

**గిరీశం:** క్లాసిక్సు రాయక పోయినా క్లాసికల్ పొయెట్ కావచ్చు ఆలోచన ముఖ్యం బై ది బై షేక్స్పియరు గొప్పవాడా, జాషువా గొప్పవాడా అన్న ఆలోచనలో పడ్డా

**మధుర:** యేడే వాడేడే? అంటూ పూటకూళ్ళమ్మ యిటు చేతిలో చీపురు కట్టతో ప్రవేశిస్తోంది

**గిరీశం:** ఈ మంచం కింద దాక్కుంటాను జాషువా శ్మశానం పద్యాలు హాయిగా వినకుండా చేసింది దండుముండ

(బయట నుంచి 'ఎన్నోయేండ్లు గతించి పోయినవి గానీ, యీ శ్మశాన స్థలిన్, కన్నుల్ మోడ్చిన మంద భాగ్యుడొకడైనన్ లేచి రాడక్కటా' వినిపిస్తుంది)

**మధుర:** దండు ముండ అంటే ఏవిటండీ? జాషువాగార్ని మనం పిలిస్తే యిక్కడకు వస్తారా?

**గిరీశం:** (మంచం క్రింద నుంచి) నీ యింటికి శ్రీశ్రీ, విశ్వనాధ, వీరేశలింగం గార్లు రాగాలేంది జాషువాగారు సందేహిస్తారా? 'ట్రయి అండ్ ట్రయి యెగైన్' అన్నాడు కాళిదాసు దండు ముండ ఎవరనా అడిగావు, ముందు దాని చేతిలోంచి చీపురు కట్టలాక్కో! మిలట్రీ ఎక్కడైనా దండుగా విడిది చేసే చోటుకి సప్లయిలు చేసే భామ

(గిరీశం వెళ్లి జాషువాగార్ని తీసుకవస్తాడు)

ఇది పిశాచులతో నిటాలే క్షణుండు
గజ్జెకదలించి యాడు రంగస్థలంబు
ఇది మరణ దూత తీక్ష్ణమౌ దృష్టులొలయ
నవని బాలించు భస్మ సింహాసనంబు (వినిపిస్తుంది)

**మధుర:** అసలు ఖండ కావ్యాలకు కీర్తి తెచ్చిన జాషువా గారికి స్వాగతం! సుస్వాగతం! మీరిక్కడకు రావడానికి సందేహిస్తారేమోనని భయపడ్డా.

**గిరీశం:** మధురవాణి మీకు సన్మానం చేస్తుంది, మీరు రావాలని నేను గురువు గారికి 'కీ' యిచ్చి కొట్టుకొచ్చా.

**మధుర:** భాషరాదు; వట్టి పాలు మాత్రమెత్రాగు
నిద్రవోవు లేచి నిలువ లేడు
ఎవరెరుంగ, రితనిదే దేశమో కాని
మొన్న మొన్ననిలకు మొలిచినాడు

శ్మశానం పద్యాలకి యిది వ్యతిరేకమైనది అయినా తరవాత మీ శిశువు పద్యాలు, మందార మకరందాలు ఖండ కావ్యాల కల్చరుకి మీరు గాడ్ ఫాదరంటారు గిరీశంగారు వెంకటేశం గారేమో జంధ్యాల పాపయ్య శాస్త్రి, కరుణశ్రీ గారి ఫేస్

**జాషువా:** భాస్కరుని దానధార లే పట్టణంబు
చారు చరితకు బంగారు నీరు బోసె
అట్టి వినుకొండ కడుపున బుట్టు కతన
ధన్యుడను నేన! యుత్తమోత్తముడ నేన!

నాకు గురువులు యిద్దరు - పేదరికం, కుల మత భేదం ఒకటి నాకు సహనాన్ని నేర్పితే రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది వడగాడ్పు నా జీవితమైతే వెన్నెల నా కవిత్వం

**మధుర:** నమోన్నమః కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ జాషువాగారి బాధ దళిత జీవుల కన్నీటి గాథ ముద్దుకృష్ణ గారు సంకలనం చేసిన 'వైతాళికులు' పుస్తకంలో మీ కవిత లేదేం?

**జాషువ:** క్రైస్తవుండ, కవిని, కడు పేదవాడ, నా
లంబనంబు నాదరంబు లేని
ఆదియాంధ్ర కులుడ నని నమస్కృతి చేసి
విన్నవించుకొంటి స్వీయ చరిత

ఎందుకో కృష్ణశాస్త్రికి నేనంటే గురిలేదు.

ఒకరు ప్రోత్సహించ నొక్కడు నిరసించ
నొకరు చేర బిలువ నొకరు తరుమ
మిట్ట పల్లములను మెట్టుచు ఎట్టులో
పలుకులమ్మ సేవ సలిపినాడ!

భావ కవిత్వం నేను చెప్పలేదు. పైగా కులవ్యవస్థ కల్పించిన మాయాజాలంతోపోరాడ్డమే సరి

నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి, రూపరే
ఖాకమనీయ వైఖరుల గాంచి, భళీ భళి, యన్నవాడె మీ
దే కులమన్న ప్రశ్న వెలయించి, చివాలున లేచి పోవుచో బాకున గ్రుమ్మినట్లగును!..

**మధుర:** గిరీశం గారు 'వేర్‌ది షూపించేస్'అనేవారు చెప్పు కరిచిన వాడికే బాధ. మీ బాధలోంచి విశ్వ జనీనమైన కవిత్వం పలికింది హిందూ క్రైస్తవ మతాల రెంటి మధ్యా నలిగిన మానవుడు మీరు, కవితా పరిశ్రమ కోసం మసీదు నాశ్రయించారు అవునా?

**జాషువా:** అమృతము చిల్కి చింతల నపనయించు
హృదయము గలట్టి నవ రచయితను నేను

**మధుర:** శ్రీశ్రీ ఉత్తమ కవుల శ్రేణిలో మీది రెండవ స్థానం అన్నాడట

**జాషువా:** కవి అంటే వాల్మీకి, మిగతావారంతా రెండవ శ్రేణి వారే వాల్మీకి కోకిల తర్వాత

**మధుర:** అష్టా అది కాదు మీరు సంప్రదాయ కవిత్వ ధోరణిని ఆశ్రయించి వ్యవహరించారు బాల గంగాధర తిలక్ 'కవిత్వం అంటే శ్రీశ్రీకి తెలుసు, కృష్ణ శాస్త్రికి తెలుసు' అన్నాడు ఆ దృష్టిలో

**జాషువా:** నాకూ తెలును విశ్వనాథ వారికి తెలుసు

**మధుర:** మీరు ఆధునికుల కవితలు సంప్ర . య ధోరణులలో ఆ పద్యాల కట్టులో లేకపోవడాన్ని నిరసించారు చెట్టు ఇస్మాయి ల్ కవితని మీరు ఒప్పుకోరు-అవునా?

**జాషువా:** పద్యం సొగసు పద్యానిది పద్యంలో చెప్పడంలో ఒకపట్టు వుంది పూర్వ కవుల పద్యాలు వేలూ వందలూ కంఠతా అప్ప చెప్పవచ్చు వచన పద్యాలనే దుడ్డుకర్రతో పద్యాల నడుముల్ విరగ దంతానన్నాడు కాని పద్యం చిరంజీవి ఇప్పుడు ఎవరి కవిత్వం అప్పజెప్పి కోట్ చేసేవాడు లేడు

**మధుర:** దాశరథీ శతకం వచ్చినట్లు కంఠతా అమృతం కురిసిన రాత్రి వస్తుందా? కంఠతారావడం రాకపోవడం మంచి కవిత్వానికి గీటురాయి కుందుర్తి 'నగరంలో వాన' ఎంత గొప్పగా వుంటుంది!

**జాషువా:** నా మార్గం నాది. అనితర సాధ్యం కాని యాత్ర కాదు ఏకోరసః కరుణ ఏవ అన్నట్లు నేను ఆశ్రయించి దాన్ని పండించుగున్నాను

ధట్టీ కట్టి నియోగి వైదిక కవుల్ దార్సిల్లి రన్యోన్యమున్
జుట్టుం బట్లు కళారణైక విజిగీషుల్, స్వీయ పాండిత్యముల్
గుట్టల్‌గుట్టలు దిమ్మరించి రలుకన్ కొన్నేడు లా దెబ్బతో
తిట్టుంకైతలు మారుమోగె, సకలాంధ్రిన్ కోటి కంఠాలతో

**మధుర:** అదో చీకటి నీడ, శతావధాన యుగంలో యీ దుర్లక్షణం విపరీతంగా పేట్రేగింది

**జాషువా:** గవ్వకు సాటిరాని పలు గాకులమూక లసూయచేత న
న్నెవ్విధి దూరినన్ నను వరించిన శారద లేచిపోవునే
ఇవ్వసుధాస్థలిన్ పొడమరే రసలుబ్ధులు ఘంట మూనెదన్
రవ్వలు రాల్చెదన్ గర గరల్ సవరించెద నాంధ్రవాణికిన్

**మధుర:** దురహంకారుల నుంచి మీకు గాయాలు తగిలినా మిమ్మల్ని ఆదుకున్న సత్పురుషులు కూడా వున్నారు కదా! ఏకా దండయ్య పంతులు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు మచ్చుకి

**జాషువా:** నేను మానసికంగా చాలా గట్టివాడ్ని
సృష్టి కర్తవు నీవు నీ సృష్టిలోని
మానవుండ నే డిద్దరి మధ్య మనకు
ముసుగులో గ్రుద్దు లాటలు పొసగ వింక
హక్కుగలదయ్య! ప్రశ్నవేయంగ నిన్ను

**మధుర:** మీ రచనలో అన్నిటి కంటె మీకు ఎక్కు యిష్టమైనది ఏది? నాకు పిరదౌసి, ఖండకావ్యాలు, తర్వాతే అన్నీ

**జాషువా:** గబ్బిలం నీకు నచ్చలేదా? కావ్య శిల్పం కంటె అభిప్రాయ ప్రకటనే ముఖ్యం నాకు వాస్తవికత నాపద్ధతి

**మధుర:** ''ప్రణయ కవి యొకండు, పాషాణ కవియొకండు'' అన్నారు కృష్ణశాస్త్రినీ విశ్వనాథనూ మీరేమంటారు?

**జాషువా:** మా కందరికీ మధ్య తగవులు పెట్టకు ఎవరి మార్గం వారిది ఎవరంత వారు వారు!

**మధుర:** మీరు హిందూ క్రైస్తవాల మధ్య పాపం నలిగారా?

**జాషువా:** ఆశయాలు గొప్పవే కాని చెప్పే దొకటి చేసేదొకటి. యిది నా సొంత మతస్థుల ధోరణి

**మధుర:** అన్నట్లు మీరు ఆస్తికులా? నాస్తికులా? క్రీస్తు చరిత్రరాసి అకాడెమీ ప్రయిజు, పద్మ విభూషణ్ కొట్టేశారు

**జాషువా:** నన్ను క్రైస్తవం నుంచి వెలి వేశారు మిషనరీ స్కూల్లో ఉపాధ్యాయుడిగా చేసేవాడ్ని కదా! ఆ ఉద్యోగంలోంచి డిస్మిస్ చేశారు కొప్పరపు సుబ్బారావుగారు మా వినుకొండ వచ్చినప్పుడు వారి మీద ఓ పద్యం రాశా. ఆయన సంతోషించాడు కాని. కొందరికి నచ్చలే ఆ సభనుంచి వాకౌట్ చేశారు ఓ సారి నాకు రైల్లో యిలాగే జరిగింది ఓ పాసెంజరు నా పద్యాలు విని భేషని మెచ్చుకుని మీదే కులం అని అడిగి నేను ఫలానా అని చెప్పగానే వాణి అంటుపడిందని తేలు కుట్టిన వాడిలా కంగారు పడ్డాడు

**మధుర:** మనుషులంతా సమానం అని పైకి లోపల ఎవరి కులం వారిదే కాని మీరో-

**జాషువా:** కుల మతాలు గీసుకొన్న గీతల జొచ్చి
పంజరాన కట్టువడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు
తరుగులేదు విశ్వనరుడ నేను

**మధుర** : మీరు గాంధీ వాది. మీది మృదు స్వభావం, సమన్వయ శీలం.

**జాషువా:** చిన్నప్పుడు స్కూల్లో బెంచీలు దూరంగా వేయించి మమ్మల్ని కూచో పెట్టేవారు. 1906 ప్రాంతంలో అంటరాని వాడని చిన్నప్పుడు నన్ను ఆటల్లోకి రానివ్వకపోతే ఒక కుర్రాడ్ని చెంపదెబ్బ కొట్టి యీషాక్‌నీకు కాదు బ్రదర్! నీ కుల భేదానికి - అని వడ్డించా. నాకు సంస్కృతం చదువుకోవాలని వుండేది. మహానుభావుడు జూపూడి యజ్ఞన్న శాస్త్రిగారు నాకు కాళిదాసత్రయాన్ని చెప్పారు.

**మధుర:** ఆయన చెప్పబట్టి మీరు మేఘసందేశం చదివారు. గబ్బిలం రాశారు. మీకు మోడర్న్ అవుట్‌లుక్ వున్నది గాని అది ట్రెడిషనల్ ఫారంలో బయట పడింది. అక్కడే పేచీ.

**జాషువా:** నిమ్న జాతుల వారి కన్నీటి నీరదాలు పిడుగులై దేశాన్ని కాల్చివేస్తాయని అన్నా అది నిజం. కుల తత్వం కరడు కట్టిన కొద్దీ నాపద్యాలు దీపాలై వెలుగుతాయి.

పంచములలోన మాదిగ వాడ నేను
పంచమీయులలో మాలవా డతండు
ఉభయులము క్రైస్తవ మతాన నొదిగినాము.

**మధుర:** అన్నట్లు వారిరువురికీ పడదు కదూ, ఒక జాతికి ఒక మతానికి చెందిన కవిత్వాలు వీలునామా కవిత్వాలు అన్ని మెట్లు బరువునీ ఆఖరి మెట్టే మోస్తున్నా వాటిలో మళ్ళీ. మా, మా చీలికలు. అందుకే అన్నారు మీరు - 'కసరి బుస కొట్టు నాతని గాలి సోక నాల్గు పడగల హైందవ నాగరాజు' అని

**జాషువా:** నాలుక్కాదు వేయి పడగలు. ఈ బలహీనతను కనిపెట్టే క్రైస్తవ మిషనరీలు 'మామా' లను చేరదీసి తమ మతంలో కలుపుకున్నారు.

**మధుర:** ఒకానొక మాధుర్యం మీ కవితలో సరస్వతీదేవి అనుగ్రహం చేత పడిపోయిందని విశ్వనాథ వారన్నారు. మీరు స్త్రీ వాద కవిత్వం రాయలేదా?

**జాషువా:** అవన్నీ నా వెనకాల వచ్చాయి. నా కత్తి కవిత. దానికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపై ద్వేషం.

'నలుబది యేండ్లు' దాటినవి నాకిపుడున్ నను ముద్దులాడు ము
ద్దుల జననీ! భవన్మధుర దుగ్ధము రక్తము రంగరించి, యు
గ్గులనిడినావు; నీ హృదయ గోళము లోపల నేను దమ్ముడున్
మెలగని తావులేదు; గణనీయము నీ జననీత్వ మూర్వినిన్

అని మా అమ్మ గురించి చెప్పుకున్నా. ఇంకా

అరువది యేండ్లు నాదగు శిరోగ్రము నెక్కిన దల్లి కంటికిన్
జిరుతమ గాక పోనిది, విచిత్రము, నేనిలు దాటిపోయినన్
మరలినదాక నా వెనుక మా యను జీవము మూడు కాళ్ళతో
దిరుగుచునుండు, నీ ఋణము దీరదు రక్తము ధార వోసినన్

**మధుర:** మీకు, సంజీవ దేవ్ గారికి ఎలా కలిసింది?

**జాషువా:** ఆ రోజుల్లో గుంటూరులో సర్జరీ శిల్పి డా.సదాశివరావు నెల కోసారి సాహితీ సదస్సు జరిపేవారు. దానిలో నేనూ సంజీవ దేవ్ గారు పాల్గొనేవాళ్ళం. శ్రోతలుగాను వక్తలుగాను. ఆ తరువాత ఏమైనా తింటూ మాట్లాడుకునేవాళ్ళం.

**మధుర:** సంజీవదేవ్ గారికి చిత్రకళ అంటే ప్రీతి దేవికారాణి రోరిక్‌లతో ప్రత్యక్ష పరిచయం వుండేదట.

**జాషువా** : ఆయనకు మీసాల్లేవు. నాకు మీసాలుండేవి. అంత పెద్ద మీసా లెందుకు మీకని వాదించేవారు నాతో.

**మధుర:** సాహిత్యంలో మీసాలతో పేచీ చాలామందికి వచ్చింది. తిరుపతి వేకంట కవులు మీసాల పద్యం ఒక ఉదాహరణ, రాయల వారి మీసం చిన్నమ్మా దేవిని యిబ్బంది పెడితే ముక్కు తిమ్మన పారిజాతపహరణం చెప్పి వారి తగవు తీర్చాడట. ''రొయ్యకు లేదా బారెడు మీసం'' అన్న ప్రయోగం వుండనే వుంది. గురజాడ అప్పారావు గారికి మీసాలే కదా అందాన్నిచ్చింది

**జాషువా:** ఆయన బహు భాషాకోవిదుడు. తెలుగులో సుందరత, ప్రధానత, సుకుమారత అని 'త' తగిలించి రాసేవాడు అది తెలుగు నుడికారం కాదని వాదించేవాడిని ఆయనకు నా కావ్యాల్లో పిరదౌసి అంటే ఇష్టం ఇతి వృత్తం అనడం రాక 'వస్తువు' అని వాడేవాడు

**మధుర:** కవితాత్మక పరిచయాలు కూడా వుంటాయి కదా!

**జాషువా:** నేను రిటైరయాక ఆయన గుంటూరు వచ్చినపుడల్లా కలుసుకునేవాళ్ళం

**మధుర:** దళితుల తర్వాత అణగతొక్కబడుతున్నది మన సమాజంలో స్త్రీలే కదా?

**జాషువా:** సర్వేజనాః సుఖినోభవంతు అని అంటాం గాని ఎవర్నీ సుఖంగా వుండనివ్వం (నవ్వు)

అబలయన్న బిరుద మంటించి కాంతల
స్వీయ శక్తు లదిమి చిదిమి నారు
సబలయన్న బిరుదు సాధించి హక్కులు
గడన చేసి కొమ్ము కష్టచరిత!

**మధుర:** మీ వంటి కవి ఒక కులానికి వర్గానికి మతానికి మాత్రమే పరిమితం కారు మీరు ప్రపంచానికి చెందుతారు. కేవలం గుంటూరు సీమకే కాదు.

**జాషువా:** భార్యని గౌరవించ లేని వాడు మనిషి కాడు.

నా తను యష్టి ప్రత్యణువునన్ గలపుష్టికి కారణంబు నీ
చేతి సుధాశనంబెకద? చిక్కనె నాకనరాదు గాని, నా
మాతకు మారుగా, యనుగుమానిని రూపము దాల్చినట్టి నా
జాతక పుణ్య రేఖవొ, ప్రశస్త శుభైక వరప్రదాత్రివో!

**గుర్రం జాషువా**

**మధుర:** భార్య కొంత కాలానికి తల్లిగా మారుతుందని ఎంత మందికి తెలుసు? మీ అమ్మాయి హేమలతను గోరాగారి లవణానికి యిచ్చి వివాహం చేసినప్పుడు 'మిగిలెన్ రసహీన కవిత్వ వాణియున్, తూలెను దేహ దార్ఢ్యము' అని వాపోయారు - ''కన్న తల్లి ఏదిశన్ నిలచి హారతులిచ్చుచున్నదో'' అన్నారు గుర్తుందా? అన్నట్లు మీరు వీరేశలింగం గారిని కలిశారట నిజమా?

**జాషువా:** 1916 -20ల మధ్య సంఘ సంస్కరణ పతాకాన్ని ఎత్తారు పంతులుగారు. రాజమండ్రిలో మానవునిగా నాకు ఆదరణ లభిస్తుందని మూవీ - మూకీ సినిమాలో కథకునిగా అల్ప వేతనంలో రాజమండ్రి చేరుకున్నా, పంతులు గార్ని కలిశా. ఆయన ఆప్యాయంగా ఆశ్రయ మందించారు. అప్పటికే ఆయన రాజ్యలక్ష్మి గారి వియోగంతో అనారోగ్యక్లేశంతో అలసివున్నారు ఆయన చిలకమర్తి వారికి పరిచయం చేశారు. చాలా సన్నిహితంగా చిలకమర్తి వారు చేరదీసి ఆశీర్వదించారు

అందరము పుట్టు పాపులమని అహేతు
కముగ భయ బీజములు నాటి ంలతపెట్టి
బ్రతుకు మత బోధకుల అనుగ్రహము తప్పి
సంఘ బాహ్యుండనైతి క్రైస్తవుల యందు.

**మధుర:** భావ కవిత్వం మీద కోపంగదా మీకు స్వామీ!

**జాషువా:** కమ్మని భావము గల ప
ద్యమ్మొక్కటి వ్రాయ జాల, వన్నిటిలో ము
గ్ధమ్మో ప్రణయమ్మో యని
యుమ్మలికించెదవు నీదియుం గవనంబా?

**మధుర:** 'అభావ కవితా చిత్రాంగి' అన్నారు కదా! 'నీ కవనము పాడు గాను వెడగా! యిక నేనియు రమ్ము దారికిన్' అని వాళ్ళను తిట్టారు రినైజాన్స్ యుగంలో వుండి దాన్ని తిట్టారు. భావ కవుల కాల్పనిక వాద యుగం మనకు సరాసరి దిగుమతి అయివచ్చింది కాల్పనిక యుగంలోని భాగమే కథలూ నవలలూ గట్రా అని గిరీశంగారు చెప్పారు.

**జాషువా:** మంచిది!

''నా కవిత్వంబునందు రత్నములు గలవు
వాని బెకలించి చూపెడు వాఁడులేఁడు
కాల మిట్లున్న''దని మొనగాఁడు వోలెఁ
బలుకు కవిగాడ యేటికి స్వాతిశయము?

**మధుర:** భావ కవులది కవిత్వం కాదని మీరు కాస్త వెనక పడ్డారు. ప్రేయసీ ప్రేయసీ అని గుండెలు బాదుకోడం మీకు నచ్చివుండదు. పైగా వైతాళికులు సంకలనంలో మిమ్మల్ని చేర్చ లేదు. మీ సత్యాగ్రహం సవబే.

**జాషువా:** ఆకాశం కేసి చూస్తూంటే అదిగో ఎంతో దూరాన కావలి దూరాన మృత్యువు నీడ బయల్దేరి నెమ్మదిగా వస్తూన్నట్లనిపించేది. అది నీడేకాదు నీడ యొక్క నీడ అన్నాడు సంజీవదేవ్‌గారు నా మీద ఆప్యాయంతో!

**మధుర:** మీ పేర ఫౌండేషన్ పెట్టి హడావిడి చేస్తున్నారు హేమలత, బలరాం గార్లు.

**జాషువా:** కవులు వ్యవస్థను ఎదిరించి నిలబడాలిగాని ప్రో ఎస్టాబ్లిషమెంటు కారాదు, మన ప్రభుత్వాలకు సాహిత్యం, చదువూ, సంస్కారాలు పట్టాయా? అంతా తంతు మాత్రమే.

**మధుర:** అసలు జ్ఞానపీఠ బహుమతికి మీరు అర్హులు

**జాషువా:** అర్హులకి ఎప్పుడైనా సరిఅయిన సత్కారాలు జరిగాయా? పుట్టపర్తి నారాయణాచార్యుల కంటె గొప్ప వాడెవడు చెప్పు. అందులో మాది గుంటూరు సీమ

**మధుర:** ఎల్లలోకము లొక్క యిల్లై
వర్ణభేదము లెల్ల కల్లై
మతములన్నీ మాసిపోయి
జ్ఞాన మొక్కటి నిలచి వెలగాలి!
అని మా గురువుగారన్నారు

**జాషువా:** (మధుర వాణి బుజం చరిచి) నా మీసాలు బాగున్నాయా?

**మధుర:** మీ కవితా సుందరితోనే కాని మీ మీసాలతో నాకేం పని? (నవ్వు) ★

*('మిసిమి' ఆగస్టు, 1996)*